RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 95 పేజీలు - 08 మంగళవారం 03 మార్చి 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఇరాన్‌పై యుద్ధం నాలుగు వారాలు ఉండొచ్చు: డొనాల్డ్ ట్రంప్



**తొలి అక్షరం/హైదరాబాద్ మార్చి 02 :** ఇరాన్‌పై సైనిక చర్యకు నాలుగు వారాలు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. బ్రిటిష్ వార్తాపత్రిక డైలీ మెయిల్‌తో ట్రంప్ మాట్లాడుతూ "ఇరాన్ ఒక పెద్ద దేశం కాబట్టి ఇది నాలుగు వారాలు లేదా అంతకంటే తక్కువ సమయం

మిగతా2లో...

## దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

● ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడి



**తొలి అక్షరం/టెహ్రాన్, 02 :** అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ గత శనివారంనాడు తొలిసారి టెహ్రాన్‌పై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే సోమవారంనాడు మరణించినట్టు ఆదేశ అధికారిక వార్తా సంస్థ

మిగతా2లో...

## పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

### అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 02:** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు. కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో

మిగతా2లో...



## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

**తొలి అక్షరం/వికారాబాద్,మార్చి 02:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి

మిగతా2లో...

అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం

రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం

డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం ముగింపులో సిఎం రేవంత్

## జల్లికట్టులో తీవ్ర విషాదం

-ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం



**తొలి అక్షరం/చెన్నై,02:** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థాని కుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి మిగతా2లో...

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు




**తొలి అక్షరం/కామారెడ్డి,మార్చి 02 :** హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు.

మిగతా2లో...

## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

- క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత



**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 02:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన

మిగతా2లో...



## సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

● ఇ-వేలంలో భారీగా అక్రమాలు ● వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి

● సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 02 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. మిగతా2లో...

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

- తెలంగాణవాసులకు హెల్ప్ లైన్




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 02:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా2లో...

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్



**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 02 :** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే,

మిగతా2లో...

# పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి కూడా మోదీ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాల, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై సమావేశంలో చర్చించారు. సంభాషణకు సంబంధించి ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా కీలక విషయాలను పంచుకున్నారు. యూఏఈ అధ్యక్షుడిని తన 'సోదరుడు' అని సంబోధిస్తూ, అక్కడ జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా యూఏఈలో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత పట్ల ఆ దేశం చూపుతున్న శ్రద్ధకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అత్యవసరంగా భేటీ అయ్యింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా తలెత్తే రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ కమిటీ కసరత్తు చేసింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్ మరియు నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే ఈ కమిటీ, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అనుసరించాల్సిన విదేశాంగ విధానం మరియు అంతర్జాతీయ వేదికలపై వినిపించాల్సిన స్వరంపై స్పష్టతనిచ్చింది. యుద్ధం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని కనిష్ఠం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వగలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం.

# రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు.ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

(మొదటి పేజీ తరువాయి)


దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24ీ7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ప్రజలకు గవర్నర్, సిఎం హోళీ శుభాకాంక్షలు



**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 02 :** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

# సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)



టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు.ప్రస్తుత వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర , పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితి లో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

# ఇరాన్‌పై యుద్ధం నాలుగు వారాలు ఉండొచ్చు: డొనాల్డ్ ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

పడుతుంది" అని అన్నారు. ఇంతలో, అవసరమైతే తమ ప్రయోజనాలను మరియు గల్ఫ్ మిత్రదేశాల ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇరాన్‌పై "రక్షణాత్మక చర్య" తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఫ్రాన్స్, జర్మనీ మరియు యుకె ఆదివారం తెలిపాయి. అదే సమయంలో, గల్ఫ్ దేశాలలో ఆందోళనలు పెరుగుతున్నాయి. బహ్రెయిన్‌లోని సల్మాన్ ట్రేడింగ్ జోన్‌లో ఒక విదేశీ నౌక క్షిపణి శిథిలాలతో ఢీకొన్న తర్వాత సంభవించిన అగ్నిప్రమాదంలో ఒక ఆసియా వ్యక్తి మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు.ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులను తీవ్రతరం చేసిన తర్వాత మొత్తం గల్ఫ్ ప్రాంతం యుద్ధం అంచున ఉంది. ఆదివారం, ఇరాన్ దుఖ్మ్ ఓడరేవుపై దాడి చేసి, ఒమన్‌కు తన దాడులను విస్తరించింది. మలయాళీలు సహా ప్రవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అల్ జజీరా ప్రకారం, ఇరాన్ దాడిలో యుఎఇలో ముగ్గురు మరియు కువైట్, బహ్రెయిన్‌లలో ఒక్కొక్కరు మరణించారు.మధ్యప్రాచ్యంలో జరిగిన దాడిలో ముగ్గురు యుఎస్ సైనికులు మరణించారు. ఐదుగురు సైనికులు గాయపడ్డారు. ఇంతలో, అరేబియా సముద్రంలో యుఎస్ విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ పేర్కొంది. భూమి మరియు సముద్రం ఇప్పుడు ఉగ్రవాద దాడి చేసేవారికి శ్మశానవాటికలుగా మారుతుందని కూడా ఆ ప్రకటన పేర్కొంది.మరోవైపు, ఇరాన్ యుద్ధనౌకను ముంచివేసినట్లు అమెరికా పేర్కొంది. విమాన వాహక నౌకపై దాడి జరిగిందని అమెరికా ఖండించింది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించని అమెరికన్ సామ్రాజ్యవాద శక్తుల దాడుల నుండి తనను తాను రక్షించుకోవడానికి ఇరాన్ తన చర్యలను కొనసాగిస్తోంది. పౌరులను చంపిన యుఎస్-ఇజ్రాయిల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలోని యుఎస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది.

# దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటికే ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనుమరాలు మృతి చెందారు. ఖమేనీ మృతితో ఇప్పటికే ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, మన్సూర్ ఖోజాస్తే కూడా మరణించడంతో టెహ్రాన్ నాయకత్వంపై ఒత్తిడి పెరిగి ఉద్రితకలు మరింత పెరిగే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.సామ్రాజ్యవాద శక్తుల దాడులను భీకరంగా తిప్పికొడతామని ఇప్పటకే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా అమెరికా మిత్రదేశాలుగా ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాక్ వరుసదాడులు జరుపుతోంది. దీంతో తక్షణమే ఇరాన్ దాడులు ఆపాలంటూ 6 గల్ఫ్ దేశాలు సోమవారంనాడు ఒక సంయుక్త ప్రకటన చేశాయి. ఇరాన్ దాడులు ప్రాంతీయ భద్రతకు ముప్పుగా పరిణమించనున్నట్టు తెలిపాయి. యుద్ధం పొరుగుదేశాలతో కాదని, తెలివి తెచ్చుకోవాలని యూఏఓ హెచ్చరించగా, దాడులు ఆపకపోతే ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసునంటూ ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. ఇజ్రాయెల్ సైతం ఇరాన్‌తో పాటు లెబనాన్‌కు దాడులను విస్తరించింది. హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్ భూభాగంపై రాకెట్లు, డ్రోన్లతో దాడులకు పాల్పడటంతో ఇజ్రాయెల్ సైన్యం సైతం యుద్ధం దీర్ఘకాలం జరిగే అవకాశాలుంటాయని హెచ్చరించింది. సూయజ్ కాలువ గుండా జరిగే షిప్పింగ్‌ను కొన్ని కంపెనీలు ఇప్పటికే సస్పెండ్ చేశాయి. మధ్యప్రాచ్యంలోని పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లో యుద్ధం ఇరాక్ తరహాలోనే ముగింపు లేని యుద్ధం కావచ్చనే అభిప్రాయాలను అమెరికా రక్షణ కార్యదర్శి పీటె హెగ్సెత్ తోసిపుచ్చారు. ఇరాక్‌తో పోల్చవద్దని, ఇది ఎంతమాత్రం ముగింపలేని యుద్ధం కాదని, ఇరాన్ సైనిక శక్తిని ధ్వంసం చేసేందుకు చేపట్టిన నిర్ణయాత్మకమైన దాడి అని చెప్పారు.

# జల్లికట్టులో తీవ్ర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని.. అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు. ఈ క్రీడలను చూసేందుకు ఏపీ, తెలంగాణ ప్రజలు భారీగా తమిళనాడుకు తరలివస్తారు. పరుగులు తీస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడి పరుగెడతారు. ఇలాంటి సమయంలో కొన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి.

# నేడు చంద్రగ్రహణంతో యాదాద్రి ఆలయం మూసివేత

**తొలి అక్షరం/యాదగిరిగుట్ట,మార్చి 02:** ఈ నెల 3న సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చందగ్రహణం కారణంగా ప్రధానాలయంతో పాటు ఉపాలయాలు, అనుబంధ దేవాలయాలలో ఉదయం 7 గంటలలోపు సుప్రభాత, నిజాభిషేకం, అర్చనలు ముగించి మూసివేస్తామని వెల్లడించారు. 4వ తేదీన ఉదయం 3 నుంచి 5.30 గంటల వరకు ప్రధానాలయంతో పాటు ఉపాలయాలను తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం సుప్రభాతం, తిరువారాధన, బాలబోగం, ఆరగింపు, నిజాభిషేకం నిర్వహించి, ఉదయం 8.45 గంటలకు ఉభయ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు.

# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)

దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు.దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

# వేయికోట్లు వసూలుకు వచ్చారా..?: రాహుల్ రాకపై కెటిఆర్ ఎద్దేవా

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 02:** లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

# హోలీ వేడుకలు సురక్షితంగా జరుపుకుందాం: మియాపూర్ ట్రాఫిక్ ఎస్సై సత్యానందం పిలుపు

● కెమికల్ రంగులకు దూరంగా ఉండి సహజ రంగులతో పండగను ఆనందంగా, ఆరోగ్యంగా జరుపుకోవాలని సూచన



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మార్చి 2:** మియాపూర్ ప్రాంతంలో హోలీ పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ విభాగం ప్రజలకు అవగాహన . ఈ సందర్భంగా మియాపూర్ ట్రాఫిక్ ఎస్సై సత్యానందం మాట్లాడుతూ, హోలీ సందర్భంగా కెమికల్ కలర్స్ వినియోగం వల్ల చర్మవ్యాధులు, కంటి సమస్యలు వంటి ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ప్రజలు సహజ రంగులను మాత్రమే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.పండగ అనేది ఆనందానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, పర్యావరణానికి హాని కలిగించని రంగులతో వేడుకలు నిర్వహిస్తేనే అసలు ఉత్సాహం సార్థకం అవుతుందని అన్నారు. ముఖ్యంగా యువత రహదారులపై నిర్లక్ష్యంగా ప్రవర్తించకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.హోలీ సంబరాలు అందరికీ సురక్షితంగా, సంతోషంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సత్యానందం కోరారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ 9వ వార్డు మెంబర్

● టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి

● నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో




**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 2:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన వెంకటాపురం గ్రామ 9వ వార్డ్ మెంబెర్ భూక్యా బుజ్జి –బిచ్య నాయక్.ప్రజా ప్రభుత్వం చేస్తున్నా అభివృద్ధి కార్యక్రమలకు ఆకర్శితులై నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి నాయకత్వం లో మేము సైతం అని కాంగ్రెస్ పార్టీ లో చేరిన నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ 9వ, వార్డ్ మెంబెర్ భూక్యా బుజ్జి –బిచ్చనాయక్ కి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లో కీ ఆహ్వానించిన టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, వెంకటాపురం సర్పంచ్ కవిత –అఖిల్,మాజీ సర్పంచ్ లు వంగాల బాబు హటియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింహులపేటలో ఆధ్యాత్మిక మహోత్సవం: శ్రీ లక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామి కళ్యాణ వేడుక!

**అమ్మవారికి 'పుస్తెమట్టల' కానుక.. దాత తాడూరి పరమేశ్వర చారి భక్తి పారవశ్యం**

**16వ వార్షిక కళ్యాణానికి ముస్తాబైన దేవస్థానం.. రేపు అంకాలమ్మ బోనాల జాతర**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మార్చి 2:** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. భక్తుల కొంగుబంగారం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ శ్రీ గోపయ్య స్వామి వారి 16వ వార్షిక కళ్యాణ మహోత్సవాలకు దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా హోమ కార్యక్రమాలతో ప్రారంభమై, రాత్రి 8 గంటలకు లోక కల్యాణం కోసం స్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుక కనుల పండువగా జరగనుంది. **అమ్మవారి సేవలో తరించిన తాడూరి పరమేశ్వర చారి:** ఈ పవిత్ర మహోత్సవంలో ఒక అపురూప ఘట్టం ఆవిష్కృతమైంది. విశ్వకర్మ జ్యువెలరీ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త తాడూరి పరమేశ్వర చారి తన అచంచలమైన భక్తిని చాటుకుంటూ అమ్మవారికి 'పుస్తెమట్టల'ను అందజేశారు. ప్రతి ఏటా లోక కల్యాణం కోసం జరిగే ఈ వేడుకలో తన వంతుగా సేవ చేయడం భాగ్యంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. దాతగా వ్యవహరించడమే కాకుండా, స్వయంగా ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొంటూ ఆయన కనబరుస్తున్న చొరవను ఆలయ కమిటీతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు వేనోళ్ల కొనియాడుతున్నారు. ఆయన సేవా గుణం అందరికీ ఆదర్శమని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తాడూరి పరమేశ్వర చారి మాట్లాడుతూ.. "జగన్మాత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి సేవలో తరించడం నా పూర్వజన్మ సుకృతం. ఈ 16వ వార్షిక కళ్యాణ వేడుకలో అమ్మవారికి పుస్తెమట్టలు సమర్పించే అవకాశం రావడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి. భక్తులందరూ ఈ వేడుకలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాను" అని భక్తి పారవశ్యంతో తెలిపారు.మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్వయంభు అంకాలమ్మ తల్లి బోనాల జాతర నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల పాటు జరిగే వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవస్థాన నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ ఉంటుందని, ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

# మారుమూల విద్యార్థులకు ఆశాకిరణం... పార్వతమ్మగూడెం పాఠశాలకు వాన్ అందజేత

● దూర ప్రాంతాల విద్యార్థుల రాకపోకలకు భారీ ఊరట

● దాతృత్వంతో ముందుకొచ్చిన లైబ్రేరియన్ భూక్యా వెంకన్నకు ప్రశంసల వెల్లువ





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మార్చి 2:** నెల్లికుదురు మండల కేంద్రంలోని పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాల, విద్యార్థుల సౌకర్యార్థం ఒక వాహనం (వాన్) అందుబాటులోకి వచ్చింది. మారుమూల గ్రామాల నుండి పాఠశాలకు రాకపోకలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం ఈ వాహనాన్ని లైబ్రేరియన్ భూక్యా వెంకన్న దాతృత్వంగా సమకూర్చారు. ఈ వాహనం ప్రారంభంతో దూర ప్రాంతాల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకొని నిరంతర విద్యాభ్యాసం కొనసాగించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల చదువుకు ఇది ప్రోత్సాహకరమైన అడుగుగా నిలుస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్చు నరేందర్, మండల విద్యాశాఖ అధికారి ఏ. రామదాస్ పాల్గొని వాహనాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు ప్రవీణ్ నాయక్, వెంకటరత్నం, రంజిత్ కుమార్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు విద్యాభివృద్ధికి సమాజం సమష్టిగా సహకరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. భూక్యా వెంకన్న చూపిన సేవాభావం పాఠశాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు.

# టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్ అధ్యక్షతన జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి పాల్గొని నూతన డైరీ ని ఆవిష్కరించి,కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వం నకు ప్రజల కు మధ్య వారధి గా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని వారన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాం కిషన్ మాట్లాడుతూ ఉద్యోగులు గా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తామని కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంధ్యారాణి,గణేష్,జడ్పీ సీఈవో రామ్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్,రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందశీ,వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గారావు,ఇంద్రసేనారెడ్డి, రమాదేవి,రజనీకాంత్ సిటీ అధ్యక్షులు శంకేశి రాజేష్,కార్యదర్శి మధుచంద్ర,జిల్లా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు,పద్మ, గణేష్,సతీష్,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫోరం అధ్యక్షులు రవికుమార్,సంగెం యూనిట్ అధ్యక్షులు కిరణ్ కుమార్,ఐసిడిఎస్ పురం అధ్యక్షురాలు రాజేశ్వరి,రూరల్ యూనిట్ అధ్యక్షులు ఆనందరావు,ఎడ్యుకేషన్ ఫోరమ్ అధ్యక్షులు నాగరాజు కార్యదర్శి నిరంజన్ రెడ్డి జిల్లా నాయకులు,మానస,మహమ్మద్ యూసుఫ్,కోపరేటివ్ ఫోరం అధ్యక్షులు వినోద్,శ్రీనివాస్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం కమిటీ హాల్ వద్ద బోరింగ్ రిపేర్ చేయించిన చిన్నకొర్పోల్ సర్పంచ్ బానోత్ అనిత- బద్రునాయక్

● ఉప సర్పంచ్ తొగరు వెంకన్న





**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 2:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పోల్ గ్రామంలో కల్లు మండువ వద్ద గల గౌడ సంఘం కమిటీ హాల్ దగ్గర చేతి పంపు (బోరింగ్) చేయించడం జరిగింది. ప్రతి సంవత్సరం ఎండాకాలం వచ్చేసరికి బోరింగ్ లో చిలుము పేరుకు రావడంతో ఈ సంవత్సరంలో కూడా చిలుము పేరుకుపోవడంతో చిన్న కోర్పోల్ సర్పంచ్ బానోతు అనిత బద్రు నాయక్, గ్రామ సిబ్బంది బొక్కల సంపత్, ఎలుక వంశీ లు దగ్గరుండి బోరింగ్ రిపేర్ చేయడం జరిగింది. ఇది పంట పొలాల దగ్గర ఉన్న కూలీలకు, మరియు గౌడ కులస్తుల కు అనుకూలంగా బోరింగ్ నీళ్లను వాడుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది గ్రామ కరోబార్ పిట్టల రాజ్ కుమార్ , గౌడ సంఘం అధ్యక్షులు చింతల వేణుగోపాల్ గౌడ్, గౌడ సంఘ ఉప సర్పంచ్ గంగపురి చంద్రమౌళి గౌడ్, గౌడ సంఘ సభ్యులు కొయ్యడ రాజు గౌడ్, కొయ్యడ ఐలయ్య గౌడ్, కొయ్యడ అనిల్ గౌడ్, గంగపురి సుధాకర్ గౌడ్, సర్పంచ్, ఉపసర్పంచ్ లు పాల్గొన్నారు.

# మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌కి పెళ్లిరోజు శుభాకాంక్షలు

● సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్.



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 2:** వరంగల్ జిల్లా నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ సింగం శ్రావణి–ప్రశాంత్ ల పెళ్ళిరోజు సందర్భంగా పుష్పగుచ్చం ఇచ్చి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ & మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహ్మద్ అమీర్,యాట శ్రావణి వినీత్, రామారపు శిరీష రాము, మోటశీ మౌనిక కృష్ణం రాజు,తదితరులు పాల్గొన్నారు.

# చల్లా పారిజాతం-కిషన్ రెడ్డికి పెళ్లిరోజు శుభాకాంక్షలు

- నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్.
- ప్రియదర్శిని యూత్ కన్వీనర్ చల్లా రగోత్తం రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 2:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చల్లా కిషన్ రెడ్డి పారిజాతం యొక్క పెళ్లిరోజు లో పాల్గొన్న మేజర్ గ్రామపంచాయతీ నెక్కొండ సర్పంచ్.పెండ్యాల హరిప్రసాద్ , మరియు వార్డ్ సభ్యులు మెరుగు విజయ్, చల్లా విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్య నాయకులు ప్రియదర్శని యూత్ కన్వీనర్ చల్లా రగోతం రెడ్డి, గరికపాటి కృష్ణారావు,కుడికాల కుమారస్వామి నేతుల సారంగపాణి, రమేష్, ఎండి మదర్, తాళ్లపల్లి భాస్కర్, గరికపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ద్వితీయ స్థానం పొందిన భీమదేవరపల్లి కబడ్డీ జట్టు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ప్రధాన మంత్రి సంసద్ క్రీడామహోత్సవంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన కబడ్డీ పోటీలలో హుస్నాబాద్ నియోజకవర్గస్థాయిలో భీమదేవరపల్లి కబడ్డీ జట్టు ద్వితీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి గెలుపొందిన జట్టు సభ్యులకు అభినందనలు తెలియజేశారు.మొదటి,రెండు స్థానాలలో గెలుపొందిన జట్లకి మళ్లీ మార్చ్ 5 నుండి 7 వరకు కరీంనగర్ లో పార్లమెంట్ స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు మాచర్ల కుమారస్వామి తెలిపారు

# రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 2:** ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించి, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధి, వైద్య సిబ్బంది సమస్యలు, ఔషధాల లభ్యత వంటి అంశాలపై చర్చించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని తెలిపారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, రామన్నపేట ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా మెరుగైన వైద్య సేవలు అందేలా కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్ఐటి రహదారి పనులు ప్రారంభం

**పశ్చిమ అభివృద్దె లక్ష్యంగా ప్రణాళికలు ..**

**ఎన్నో ఏళ్ల సుదీర్ఘ సమస్యలకు పరిష్కార మార్గాలు..**

**గాంధీనగర్ శ్మశానవాటిక రోడ్డు నిర్మాణం కోసం భూ కేటాయింపు చేసిన ఎమ్మెల్యే..**

**దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు మార్గం సుగమం.**

**ఒకే రోజు రూ.9.37 కోట్ల పనులకు శంకుస్థాపన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**

**పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.సోమవారం రోజున 48, 49 డివిజన్ల పరిధిలో సుమారు రూ.9.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.రూ.7.50 కోట్ల వ్యయంతో ఎన్ ఐ టి నుంచి లోటస్ కాలనీ వరకు ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ రహదారి రెండు వైపులా సెంటర్ లైటింగ్ వ్యవస్థతో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.అదేవిధంగా 48వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం,రూ.1.37 కోట్లతో లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కూడా పాల్గొన్నారు.అనంతరం మీడియాతో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు.శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్ ఐ టి రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు.గతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎవరు పట్టించుకోలేదని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులను సమకూర్చి ప్రత్యేక దృష్టితో ఈ రోజు పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు.కాజీపేట దర్గాలో గల గాంధీ నగర్ ప్రజలకు ఎన్నో ఏళు _గా సమస్యగా ఉన్న స్మశాన వాటిక రోడ్డు కోసం దర్గా పీఠాధిపతి కుసురు పాషా ను ఒప్పించి రోడ్డు ఏర్పాటు స్థలాన్ని కేటాయించడం జరిగిందని తద్వారా ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగుపడుతున్నదని అన్నారు.అన్ని డివిజన్లలో అంతర్గత రోడ్లు,సీసీ డ్రైనేజీ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.కాజీపేట దర్గా పరిసర ప్రాంతాలు దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని,ఇప్పుడు ఆ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.దర్గా రైల్వే ట్రాక్ అవతల నివసించే ప్రజల గేట్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ పనులను సుగుమం చేశామన్నారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా ప్రజా అభివృద్ధినే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.ప్రజలను మోసం చేసే మాయ మాటలను నమ్మకుండా పనిచేసే వారిని గుర్తించి భవిష్యత్తులో ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్,సత్రాజ్ బేగం,మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు అమర్,కట్ట రఘుపాల్ రెడ్డి,మట్టెడ కుమార్,డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్,మల్లారెడ్డి తదితరులు అధికారులు పాల్గొన్నారు.





## శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వేముల





**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 2:** రామన్నపేట మండలం పరిధిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేముల వీరేశం పలు గ్రామాల్లో శంకుస్థాపనలు నిర్వహించారు.నీర్నేముల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణ పనులకు సి.సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నిధాన్ పల్లి గ్రామంలో సి.సి రోడ్డు మహిళా సమాఖ్య సంఘ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొమ్మాయిగూడెం గ్రామంలో సి.సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో నిర్మించ నున్న మహిళా సమాఖ్య సంఘం భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు నిర్మించడం ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి చాటిచెప్పిన ఎమ్మెల్యే కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని వినతి..

**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ మార్చి 2:** ఈనెల 05-03-2026 నుండి 13-03-2026 వరకు నిర్వహించను న్న ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దిన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఈరోజు శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సతీష్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం విద్యార్థులు ఉపవాస దీక్షలు పాటిస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం ఇబ్బందికరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. కరీంనగర్ పరీక్షా కేంద్రాలకు జిల్లా విద్యార్థులతో పాటు పక్క జిల్లాలు మరియు దూర ప్రాంతాల నుండి కూడా విద్యార్థులు రావాల్సి ఉంటుందని, ఎండ తీవ్రతలో ఉపవాస స్థితిలో ప్రయాణం చేయడం వారికి శారీరకంగా కష్టసాధ్యమవుతుందని తెలిపారు. కాబట్టి పరీక్షల సమయాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చాలని, అలాగే పరీక్షలను ఈనెల 20-03-2026 తరువాత నిర్వహించాలని రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, లయీఖ్ ఖాద్రీ, మొహమ్మద్ కలిమొద్దీన్, మొహమ్మద్ సలీం, అబ్దుల్ బారీ, ఎండీ బషీర్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి మండలంలో అగ్నిప్రమాదం : రూ 20 వేలు ఆస్తి నష్టం

**తొలి అక్షరం/ఏపీ: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: మార్చి 2 :** చౌడేపల్లి మండలం ఆమినిగుంట పంచాయతీలో అగ్నిప్రమాదం సంభవించి రూ.20. వేలు ఆస్తి నష్టం జరిగిందని పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. సింగిరిగుంట గ్రామ సమీపంలో ఎం.ప్రకాష్ అను వ్యక్తికి చెందిన టమోటా చెట్లకు నాటే కట్టెలు అగ్ని ప్రమాదానికి గురైందని ఆయన తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వెంటనే తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడం జరిగిందని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. రమేష్ తన పొలం వద్ద ఉంచిన కట్టెల్లో ఒకసారి ఇగ మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు మంటలను ఆర్పి ప్రయత్నం చేశారు. ఫైర్ అధికారులు చేరుకోవడంతో మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ మంటలలో కట్టెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి సిగరెట్ ముక్కలను ఆర్పకుండా పడవేయడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు.

## అధికారికంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

**తొలి అక్షరం/ఖమ్మం, మార్చి 2 :** శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌ని కలిసిన శాసనసభ్యుని కుటుంబం

**• కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు భరత్ చందర్ రెడ్డి**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మార్చి 02:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్, మాజీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా రాహుల్ గాంధీని కలిశారు. తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ లో డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులలో పాల్గొని చివరి రోజు సోమవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ని కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తో ఎమ్మెల్యే డా"భూక్యా మురళి నాయక్ కుటుంబ సభ్యులు డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, రితిక్ సిద్ధార్థ్ , భువన్ సిద్ధార్థ్ మాజీ డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప రెడ్డి కలిసితో ఫోటో దిగారు.

## బిషప్ ఆర్డినేషన్ సేవలో మరింత బాధ్యత

**ఆగాబే డయాసిస్ తెలంగాణ బిషప్ విక్రం పాల్.**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మార్చి 02:** సేవా పరిచర్యలో బిషప్ అభిషేకం వల్ల మరింత బాధ్యత పెరుగనుందని ఆగాబే డయాసిస్ తెలంగాణ ఆర్చ్ బిషప్ విక్రమ్ పాల్ అన్నారు. సోమవారం జిల్లాలోని కేసముద్రం మండలం బీరువాడ గ్రామంలోని ప్రభు యేసు ప్రార్థన మందిరం ఆవరణంలో ప్రత్యేక కృతజ్ఞత కూడికను ఏర్పాటు చేశారు. ఈ కుడికలో జిల్లాలోని ఆరుగురు దైవ సేవకులకు ఆగాబే డయాసిస్ ఆధ్వర్యంలో బిషప్ అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి తెలంగాణ రాష్ట్ర ఆగాబే డయాసిస్ అధ్యక్షులు ఆర్చ్ బిషప్ విక్రమ్ పాల్ చేతుల మీదుగా బిషప్ అభిషేకమును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని పరిచర్యలో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చు తేనె దేవుని ప్రణాళికను నెరవేర్చిన వారు అవుతారని తెలిపారు. బిషప్ లుగా అభిషేకం స్వీకరించిన ప్రతి సేవకులు తమ పరిచర్యను మరింత బలంగా బాధ్యతగా ముందుకు వెళ్లాలని సూచించారు. త్వరలోనే ఆగాబే డయాసిస్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో అనేక మందిరాలు నిర్మాణం చేయన్నట్లు తెలిపారు. ఆర్చ్ బిషప్ లుగా అభిషేకింపబడిన దైవ సేవకులను సన్మానించి, వారిని ఆశీర్వదించారు. అగాబే డయాసిస్ తెలంగాణ రాష్ట్ర బాధ్యులు విక్రమ్ పాల్, అమ్మ గార్లను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. బిషప్ లుగా అభిషేకం బిషప్ మన్సూర్ నాయక్ ను తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా, బిషప్ ఏసు పాదమును తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, బిషప్ లాల్ సింగ్ నాయకులు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా, బిషప్ రూబెన్ పాల్ ను మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ రెవరెండ్ మల్లెపాక తిమోతి, రెవరెండ్ సంపత్ పాస్టర్, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుధాకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బండారు వెంకన్న, వివిధ సంఘాల కాపరులు, పాల్గొన్నారు.



## బహుమతుల అందజేత




**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 2:** తెలంగాణా స్టేట్ లెవెల్ బాయ్స్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలలో ప్రథమ స్థానం లో నిలిచినజోగులాంబగధ్వాల జట్టు: 45 వ తెలంగాణా స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీలలో ప్రథమ బహుమతి జోగులాంబ గధ్వాల జట్టు గెలుచుకోగా, ద్వితీయ బహుమతి వికారాబాద్ జట్టు గెలుచుకుంది, తృతీయ స్థానం లో యాదాద్రి జట్టు నిలిచింది గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ చేతుల మీదుగా గెలిచిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగిందిమరియు ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ మెంబెర్ వరికుప్పల స్వామి,షూటింగ్బాల్ తెలంగాణా స్టేట్ జనరల్ సెక్రటరీ. ఐలయ్య, యాదాద్రి దిష్టిక్ అధ్యక్షులు మోత్కూరి యాదయ్య, సెక్రటరీ మోత్కూరి మానస,వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు,స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ నిర్మల చేతుల మీదుగా బహుమతులు సర్టిఫికెట్ లు అందించడం జరిగింది ,వివిధ జిల్లాల కోచ్లు,చంద్రమౌళి,స్కూల్ పీడీ మణి,క్రీడాకారులుమాట్లాడుతు మంచి ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కి ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమం లో సీనియర్ నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి, రాజన్నగారి రమేష్, రవ్వ నర్సింహా, సింగణబోయిన జంగయ్య,ఈర్లపల్లి మల్లయ్య,గోళ్లేపల్లి యాదయ్య,ఈర్లపల్లి రమేష్,గర్ధాస్ కరుణాకర్ ,జిట్టబోయిన వెంకటేష్,బోనగిరి సంజీవ,బోనగిరి మధు, వెలిమినేటి నరేష్, గోగికార్ రాజుకుమార్,గర్ధాస్ వెంకటేష్, గర్ధాస్ శ్రీకాంత్, గడ్డం సాయి,కాటపల్లి నరేష్,గొర్ల నవీన్, గర్ధాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వర్ణాల పులకింత.. శ్వేత వర్మ హోలీ వసంతం!

**నిజాయితీకి నిలువుటద్దం 'బిగ్ బాస్' తార శ్వేత వర్మ ప్రత్యేక ఇంటర్వ్యూ**

**కృత్రిమ రంగులు వద్దు.. ప్రకృతి ఒడిలో పండుగ జరుపుకుందాం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మార్చి 2:** వెండితెరపై మెరిసే తారలు ఎందరో ఉంటారు, కానీ మనసులోని మాటను మొహమాటం లేకుండా చెప్పే ధైర్యవంతులు కొందరే ఉంటారు. అటువంటి వారిలో అగ్రస్థానంలో నిలుస్తారు నటి శ్వేత వర్మ. బిగ్ బాస్ వేదికపై తనదైన ముద్ర వేసి, తెలుగు ప్రేక్షకుల గుండెల్లో 'ఫైర్ బ్రాండ్'గా నిలిచిన ఈ సుందరి, హోలీ పండుగ వేళ ప్రకృతి ప్రేమను చాటుకున్నారు. **తొలి అక్షరం రిపోర్టర్‌తో ముచ్చటిస్తూ ఆమె పంచుకున్న ఆసక్తికర విశేషాలు:** "హోలీ అంటే కేవలం రంగుల కలయిక మాత్రమే కాదు, అది మన సంస్కృతిలో భాగమైన ఒక పవిత్ర వేడుక. నేడు మనం వాడుతున్న రసాయన రంగులు మన చర్మానికే కాకుండా, మూగజీవాలకు, పర్యావరణానికి కూడా తీరని నష్టం కలిగిస్తున్నాయి. అందుకే నేను ఎప్పుడూ ప్రకృతి సిద్ధమైన రంగులనే ఇష్టపడతాను. పసుపు, కుంకుమ, మోదుగ పూల వంటి సహజ వనరులతో హోలీ జరుపుకోవడం వల్ల మన ఆరోగ్యం భద్రంగా ఉంటుంది. పండుగ ఆనందం పదికాలాల పాటు గుర్తుండిపోవాలంటే అది సురక్షితంగా ఉండాలి," అని శ్వేత వర్మ ఎంతో ఉత్సాహంగా వివరించారు. **గగనతల ప్రయాణం నుండి గ్లామర్ ప్రపంచం వరకు:** శ్వేత వర్మ ప్రస్థానం ఒక అద్భుత కావ్యం. తొలుత అంతర్జాతీయ విమానయాన సంస్థలో ఎయిర్ హోస్టెస్‌గా గగన విహారం చేసిన ఈమె, నటనపై ఉన్న మక్కువతో వెండితెరకు పరిచయమయ్యారు. హిందీ చిత్రసీమలో తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, తెలుగులో 'పచ్చీస్', 'ముగ్గురు మొనగాళ్లు' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. బిగ్ బాస్ హౌస్‌లో ఆమె చూపిన తెగింపు, నిజాయితీ ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో మెదులుతూనే ఉన్నాయి.ముఖ్యంగా నేటి యువత సంప్రదాయాలను విస్మరించకూడదని ఆమె కోరారు. "నీటిని వృథా చేయకుండా, సామాజిక బాధ్యతతో పండుగను ఆస్వాదించండి. రంగుల వెనుక ఉన్న ప్రేమాభిమానాలను పంచుకోండి కానీ, ఆరోగ్యాన్ని పణంగా పెట్టకండి" అని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ, సామాజిక స్పృహతో చేస్తున్న ఈ ప్రచారం అందరినీ ఆలోచింపజేస్తోంది.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలు, విద్యాసంస్థలను తనిఖీలు నిర్వహించాలి**

**హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మార్చి 02:** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులు ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థలు, రెవెన్యూ) అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.అనిల్ కుమార్, తో కలిసి కలెక్టర్ ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన అర్జీలను పరిశీలించి తమ పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాలకు సిఫారసు చేసి సమస్య పరిష్కారం చేయుటకు కృషి చేయాలని ఆదేశించారు,జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలలో మండల ప్రత్యేక అధికారులు ప్రతి 15, రోజులు లేదా మాసంలో మూడు దఫాలుగా వారికి కేటాయించిన హాస్టల్లో తనిఖీ చేసి విద్యార్థులతో స్వయంగా మాట్లాడి అందుతున్న మౌలిక వసతులు విద్యా బోధనల గురించి వివరాలు అడిగి తెలుసుకొని తనకు నివేదిక సమర్పించాలని సూచించారు, ప్రతి విద్యా సంస్థలలో పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్ సానిటేషన్ లపై ఎలాంటి జాప్యం లేకుండా సౌకర్యాలు కల్పించాలని, షెడ్యూలు ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మానసిక ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని తెలిపారు, పదవ తరగతి పరీక్షలు వస్తున్న నేపథ్యంలో టైం టేబుల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించి జిల్లాలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు,మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను తనిఖీ చేస్తూ అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశల్లో ప్రత్యేక చొరవ తీసుకొని లబ్ధిదారులకు తక్షణ సేవలను అందించాలన్నారు,ప్రజావాణి కార్యక్రమంలో ఈరోజు వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ క్రింది విధంగా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు, గార్ల మండలం బాలాజీ తండ పంచాయతీ కి చెందిన భూక్య శాంతి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినదని సాంకేతిక కారణాలతో బిల్లు మంజూరు కావట్లేదని తన సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.మరిపెడ మండలానికి చెందిన గోలి మృత్యుంజయ తన ఇంటికి సమబందించి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం చాలా ఎక్కువగా వచ్చిందని సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని అన్నారు.మహబూబాబాద్ మండలం డి.ఎస్.ఆర్ జండాల తండ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలో 5 తండాలు ఉన్నాయని అట్టి తండాలకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మాణం చేయాలని కోరారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన పి.సునీత ఇందిరమ్మ ఇండ్ల రెండవ దశ నిర్మాణం బిల్లు మంజూరు చేయవలసిందిగా కోరి ఉన్నారు.బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన వెంకటాద్రి తాను దీర్ఘకాలిక వ్యాది పక్షవాతం తో భాదపడుతున్నానని బతుకుదెరువుకు ఆధారం ఏమి లేదని వికలాంగుల పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని అన్నారు,బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గంగా మార్చుటకు సిఫారసు చేయాలని,నియోజకవర్గ సాధన కమిటీ సభ్యులు దరఖాస్తు చేశారు,ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో (107 ) దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి క్రిష్ణవేణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈవో పురుషోత్తం, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిపిఓ హరిప్రసాద్, ఎక్సైజ్ ఎస్పి కిరణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి మరియన్న, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస రావు, శ్రీనివాస్,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# దేవునిపల్లి రంగారెడ్డి గూడలో అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన

**● దేవునిపల్లి గ్రామ సర్పంచ్ కురువ లలిత మల్లేష్**





**తొలి అక్షరం/షాద్ నగర్,మార్చి02:** దేవునిపల్లి గ్రామంలోని రంగారెడ్డి గూడలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడి భవనానికి గ్రామ సర్పంచ్ కురువ లలిత మల్లేష్ శ్రీకరం చుట్టారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ తో పాటు,డిప్యూటీ సర్పంచ్ చిట్టళ్ల మల్లేష్, స్థానిక వార్డు సభ్యులు, అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొని భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు కోరుకుంటున్న శాశ్వత అంగన్వాడి భవనం కల ఇప్పుడు నిజమవుతోంది. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.డిప్యూటీ సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలోని బాలల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, అంగన్వాడి కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు.శాశ్వత భవనం నిర్మాణంతో చిన్నారులకు మెరుగైన పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడంతో పాటు తల్లిదండ్రులకు కూడా సౌకర్యాలు కలుగుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి ఇది ఒక ముఖ్య మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.గ్రామ పాలకవర్గం సభ్యులు, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అందె మోహన్‌కు ఘన సన్మానం



**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి02:** షాద్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన అందె మోహన్ ను సోమవారం సామాజిక కార్యకర్త నీల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 14వ వార్డు కౌన్సిలర్‌గా అత్యధిక మెజారిటీతో విజయం సాధించి, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన యువ నాయకుడు అందె మోహన్ అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. **సేవా దృక్పథం కలిగిన యువ నాయకత్వం:** ఈ కార్యక్రమంలో నీల రవీందర్ మాట్లాడుతూ.. యువకుడు, ఉత్సాహవంతుడైన అందె మోహన్ వైస్ చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఆయన, ఇప్పుడు మున్సిపాలిటీ మొత్తానికి తన సేవలని విస్తరించడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువాతో కప్పి, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. పాల్గొన్న ప్రముఖులు ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని అందె మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్న వారిలో ఎల్కుర్తి నారాయణ (ఫరూక్ నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు) హన్మారి మురళీధర్ (మండల మాజీ అధ్యక్షులు) శ్యాం సుందర్, భక్తవత్సల్, నిరంజన్, మల్లేష్, అభిలాష్, వేణు, తేజ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. చివరగా అందె మోహన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన 14వ వార్డు ప్రజలకు మరియు తనను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌అన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు షాద్‌నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

**● కోర్టు కాంప్లెక్స్ లో పట్టణ న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు ● కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 16వ జిల్లా అదనపు జడ్జి ఎస్.స్వాతి రెడ్డి ● కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి ● కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్**






**తొలి అక్షరం/షాద్ నగర్,మార్చి02:** ఆరోగ్యమే మహాభాగ్యమని న్యాయవాదులకు వృత్తిరీత్యా ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, మానసిక సంఘర్షణకు లోనవుతూ ఉంటారని, న్యాయవాదులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వృత్తిపరమైన ఆటంకాలు లేకుండా పనులు సాఫీగా జరుపుకుంటారని, న్యాయవాదులు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు ఆరోగ్యపరమైన సమస్యలు లేకుండా, ఎల్లప్పుడూ వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి న్యాయవాదులు వైద్య పరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న ఉచిత మెగా హెల్త్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 16వ జిల్లా అదనపు జడ్జి ఎస్. స్వాతి రెడ్డి న్యాయవాదులకు సూచించారు. షాద్ నగర్ పట్టణం న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి మరియు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ వారి సౌజన్యంతో న్యాయవాద బార్ అసోసియేషన్ లో నిర్వహించబడుతున్న మెగా హెల్త్ క్యాంప్ ను 16వ జిల్లా అదనపు జడ్జి, స్వాతి రెడ్డి ప్రారంభించారు. హెల్త్ క్యాంపులో పట్టణ న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు షుగర్ బీపీ కొలెస్ట్రాల్ రక్త పరీక్షలు, కార్డియాలజీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలకు అవసరమైన మందులను సూచిస్తూ తగు తగు జాగ్రత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులతో పాటు పాటు అపోలో హాస్పిటల్స్ డాక్టర్ సిమ్రాన్, ప్రవల్లిక, భార్గవి, అరుణ, నిరోష తదితరులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

# రెవెన్యూ శాఖకు 11, ఇతర శాఖలకు 40 ఫిర్యాదులు

**● సత్వర పరిష్కారానికి మార్గం చూపాలని ఆయా శాఖలకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశం**





**తొలి అక్షరం/రంగారెడ్డి, మార్చి 02:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినిపిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు అందజేసే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 11, ఇతర శాఖలకు చెందిన 40 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. మొత్తం 51 దరఖాస్తులు నమోదు చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి (రెవెన్యూ), వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉరుములు , మెరుపుల నుంచి విద్యుత్ వ్యవస్థ రక్షణకు లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు



**తొలి అక్షరం/ములుగు జిల్లా,మార్చి 02:** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మెరుపు, పిడుగుల కారణంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరియు సబ్‌స్టేషన్లకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ములుగు సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఏ . ఆనందం తెలియజేశారు . విద్యుత్ పంపిణీ వ్యవస్థను రక్షించేందుకు కీలక ప్రాంతాల్లో లైట్నింగ్ అరెస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటి వరకు 36 లైట్నింగ్ అరెస్టర్లు పెట్టామని చెప్పారు . లైట్నింగ్ అరెస్టర్ అనేది మెరుపు పిడుగు వల్ల ఉత్పన్నమయ్యే అధిక వోల్టేజ్‌ను భూమిలోకి సురక్షితంగా మళ్లించే రక్షణ పరికరం అని వివరించారు . దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌గియర్ పరికరాలు ఇతర విద్యుత్ యంత్రాంగం సురక్షితంగా ఉండి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయి పేర్కొన్నారు . మెరుపులు కారణంగా కలిగే బ్రేక్‌డౌన్లు తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.వినియోగదారులు వర్షాకాలంలో ఇంటి విద్యుత్ పరికరాలకు సర్జ్ ప్రొటెక్టర్లు వినియోగించడం, మెరుపు సమయంలో అనవసరంగా విద్యుత్ పరికరాలను తాకకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సూపెరింటెండింగ్ ఇంజనీర్ తెలియజేశారు

# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం



అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకోవడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్ఘాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే– ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హాళసీన్ మొహ్సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తరిఉగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

---



# ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

**• అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన**

**వాషింగ్టన్,మార్చి1:** ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో 200 మంది మరణించినట్లు తెలిసింది. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

**తామే కూల్చామని ఇరాన్ ప్రకటన**



**కువైట్,మార్చి1:** అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్‌దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రికత్తలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మద్దతు కలిగిన ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ప్రపంచవ్యా ప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ప్రారంభించింది

# కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

**బాంబు దాడిలో ధ్వంసమైన గాంధీ ఆస్పత్రి**

**165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు**



**టెహ్రాన్,మార్చి1:** అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి. దట్టమైన పొగలు వెలువడటంతో హాస్పిటల్ లో ఉన్న రోగులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్ యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. ఓ వైపు బాంబు దాడులు జరుగుతున్నా నర్సులు తమ ప్రాణాలకు తెగించి ఇన్సులేటర్లలో ఉన్న నవజాత శిశువులను, ఐసీయూలోని చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ స్పందించారు. ఆసుపత్రులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలావుంటే ఇరాన్‌లోని మినాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 165కి పెరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్‌లోని షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఈ దాడి జరిగింది. 96 మంది గాయపడ్డారని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ నివేదించింది. దాడి జరిగిన ప్రదేశంలో శోధన, రక్షణ చర్యలు ముగిశాయని మినాబ్ కౌంటీ గవర్నర్ తెలిపారు. బాలికల పాఠశాలపై దాడి వార్తలను ఇజ్రాయిల్ ఖండించింది. నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ట్విట్టర్‌లో దాడికి సంబంధించిన ఫోటోను పంచుకున్నారు. ఇజ్రాయిల్, అమెరికా శనివారం ఇరాన్‌పై ఉమ్మడి దాడిని ప్రారంభించాయి. ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరియు ఇతర సీనియర్ సైనిక అధికారులు మరణించారు.

# శివమ్ దూబే వల్లే గెలిచాం: గంభీర్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు.సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.'అని గంభీర్ స్పష్టం చేశాడు.



# సంజూ శాంసన్.. కోహ్లీ, రోహిత్ రికార్డ్ బద్దలు!

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఛేజింగ్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన ఆటగాడిగా కూడా సంజూ శాంసన్ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రికార్డులను సంజూ శాంసన్ అధిగమించాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్‌తో కోల్‌కతా వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్)అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్ ఛేజింగ్‌లో టాప్ స్కోర్ కోహ్లీ పేరిట ఉండేది. అతను టీ20 ప్రపంచకప్ 2022లో పాకిస్థాన్‌పై, 2016 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఛేజింగ్‌లో 82 పరుగులు చేశాడు.సంజూ శాంసన్ తరహాలోనే ఈ రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ భారత్‌కు విజయాన్నందించాడు. తాజా మ్యాచ్‌లో సంజూ 97 పరుగులతో అజేయంగా నిలిచి కోహ్లీని వెనక్కినెట్టాడు. ఈ మ్యాచ్‌లో 16 బౌండరీలతో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో అత్యధిక బౌండరీలు బాదిన రోహిత్ శర్మ(15)ను రికార్డును అధిగమించాడు.రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 15 బౌండరీలు బాదగా.. సంజూ శాంసన్ తాజా ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 16 బౌండరీలు బాది హిట్ మ్యాన్‌ను అధిగమించాడు. సురేశ్ రైనా తర్వాత టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ కలిగిన రెండో భారత బ్యాటర్‌గా సంజూ శాంసన్ నిలిచాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో సురేష్ రైనా(60 బంతుల్లో 101) సౌతాఫ్రికాపై సెంచరీతో చెలరేగాడు. పొట్టి ప్రపంచకప్‌లో భారత్ తరఫున సెంచరీ బాదిన ఏకైక బ్యాటర్ కూడా సురేష్ రైనానే కావడం గమనార్హం.గురువారం వాంఖడే వేదికగా జరిగే సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. సంజూ శాంసన్ సూపర్ ఫామ్ నేపథ్యంలో అభిషేక్ శర్మను తుది జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు అనడానికి సంజూ శాంసన్ కెరీరే ఉదాహరణ. ఈ మెగా టోర్నీకి ముందు సంజూ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడ్డాడు. ఐదు మ్యాచ్‌లకు ఐదింటిలో విఫలమయ్యాడు. చివరకు తుది జట్టులో చోటు కోల్పోయాడు. కానీ అనూహ్యంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసలు సిసలు మ్యాచ్‌లో సత్తా చాటాడు. జీవితానికి సరిపోయే ఇన్నింగ్స్ ఆడాడు.



## 3వసారి సెమీస్‌లో ఢీ కొట్టనున్న

# భారత్, ఇంగ్లాండ్

టీమ్ ఇండియా మరోసారి టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సూపర్-8 దశలో ఉత్కంఠభరిత పోరాటం అనంతరం, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన 'డూ లేదా డై' మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి చివరి నాలుగులో చోటు సంపాదించింది. ఇది వరుసగా మూడోసారి భారత్ సెమీఫైనల్ చేరడం విశేషం. 2022, 2024 ఎడిషన్లలో కూడా టీమ్ ఇండియా సెమీఫైనల్ దశకు చేరుకుంది.ఈ కీలక మ్యాచ్‌లో భారత్‌కు తప్పనిసరిగా విజయం అవసరం. ఓటమి పాలైతే టోర్నీ ప్రయాణం ముగిసిపోయేది. కానీ సంజూ శాంసన్ అద్భుతమైన నాటౌట్ 97 పరుగులతో జట్టును విజయానికి చేర్చాడు. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ విజయవంతంగా ఛేదించింది.ఇప్పుడు మార్చి 5న ముంబై వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇది వరుసగా మూడో టీ20 వరల్డ్ కప్, ఈ రెండు జట్లు సెమీఫైనల్‌లో తలపడుతున్న సందర్భం. గత రెండు ఎడిషన్లలో ఒక విశేషమైన సెంటిమెంట్ ఉంది. భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్‌లో గెలిచిన జట్టే చివరికి చాంపియన్‌గా నిలిచింది. 2022లో భారత్‌ను ఓడించిన ఇంగ్లాండ్ ఫైనల్‌లో టైటిల్ గెలిచింది. 2024లో ఇంగ్లాండ్‌ను ఓడించిన భారత్ చివరకు ట్రోఫీ సాధించింది. ఇప్పుడు 2026లో కూడా ఇదే సెంటిమెంట్ కొనసాగుతుందా? అన్నది 8న జరిగే ఫైనల్‌తో స్పష్టమవుతుంది. మొత్తానికి, భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్ పోరు మరోసారి ప్రపంచ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురి చేయనుంది. గెలిచే జట్టే చాంపియన్ అవుతుందా? అన్న ప్రశ్నకు సమాధానం త్వరలోనే తెలుస్తుంది.



# అభిషేక్ శర్మ ఫామ్‌పై అనిల్ కుంబ్లే ఆందోళన

టీ20 వరల్డ్ కప్ 2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. సెమీఫైనల్ బెర్తులు ఖరారైన వేళ టీమిండియాలో ఒకే ఒక్కడి ఫామ్ ఇప్పుడు సెలక్టర్లకు, అభిమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అతడే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించి, సిక్సర్ల కింగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ కుర్రాడు.. మెగా టోర్నీలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన చావోరేవో తేల్చుకోవాల్సిన సూపర్ 8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ చేతులెత్తేశాడు. 11 బంతుల్లో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరడం గిల్ సేనలో చర్చకు దారితీసింది. అభిషేక్ శర్మకు ఈ టోర్నీ ఒక పీడకలలా మారింది. గ్రూప్ స్టేజీలో ఆడిన మూడు మ్యాచుల్లో వరుసగా మూడు సార్లు డకౌట్ (0, 0, 0) అయి చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు.



# పాకిస్తాన్ ఆటగాళ్లకు ఫైన్ వేసిన పీసీబీ!

2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. దీని పరిణామాలు ఆటగాళ్లపై గట్టిగానే ఉంటోంది. పాకిస్తాన్ జట్టు పేలవమైన ప్రదర్శనకు సంబంధించి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన చర్యలు తీసుకుంది. ప్రతి ఆటగాడికి జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించింది. పాకిస్తాన్ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన తర్వాత ఈ శిక్ష వేశారు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, పీసీబీ స్వయంగా ఆటగాళ్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేస్తుంది, ఇది చాలా ఆశ్చర్యకరమైన నిర్ణయంగా కూడా చెబుతున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ 8 రౌండ్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమించింది. పాకిస్తాన్ సెమీ-ఫైనల్‌కు చేరుకోలేకపోయిన వరుసగా ఇది నాల్గో ఐసీసీ టోర్నమెంట్. అందుకే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కఠినమైన చర్యలు తీసుకుంది. మీడియా నివేదికల ప్రకారం, పీసీబీ ప్రతి ఆటగాడికి 5 మిలియన్ పాకిస్తానీ రూపాయలు (సుమారు 1.6 మిలియన్ భారతీయ రూపాయలు) జరిమానా విధించింది. ఈ జరిమానా ప్రపంచ కప్‌లో పాల్గొన్న జట్టు సభ్యులందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా జట్టు ఇప్పటికే విమర్శలను ఎదుర్కొంటున్నందున, పాకిస్తాన్ క్రికెటర్లకు ఇది భారీ మొత్తం అని చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని పీసీబీ స్వయంగా తిరిగి తీసుకోనుంది. ఆటగాళ్లు తమ జీతాలు, మ్యాచ్ ఫీజులు లేదా ఇతర చెల్లింపుల నుంచి తగ్గింపులను భరించాల్సి ఉంటుంది. శ్రీలంకలో జరిగిన టీ20 ప్రపంచ కప్2026 లో పాకిస్తాన్ తన అన్ని మ్యాచ్‌లు ఆడింది, కానీ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. వారు నెదర్లాండ్స్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించడం ద్వారా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అయితే, ఆ మ్యాచ్‌లో కూడా వారు తృటిలో ఓటమిని తప్పించుకున్నారు. ఆ తర్వాత వారు యూఎస్ఏ పై 32 పరుగుల తేడాతో గెలిచారు, కానీ టీమ్ ఇండియాపై 61 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వారు ఏదో విధంగా సూపర్ 8లోకి ప్రవేశించారు. అయితే, సూపర్ 8లలో వారి ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రద్దు అయిన తర్వాత, వారు ఇంగ్లాండ్ చేతిలో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత వారు శ్రీలంకపై గెలిచారు, కానీ నెట్ రన్ రేట్ కారణంగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు.

# భారత్- ఆఫ్ఘనిస్తాన్ మధ్య తొలిసారి వన్డే సిరీస్

**2 దేశాల మధ్య ద్వైపాక్షిక వన్డే సిరీస్**

**3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జూన్ 2026లో మొదలు**

టి20 వరల్డ్ కప్ 2026 మ్యాచ్‌లతో టీమిండియా బిజీగా ఉన్న సమయంలో బీసీసీఐ మరో కొత్త సిరీస్ ప్రకటించింది. భారత క్రికెట్ అభిమానులకు ముఖ్యమైన అప్డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2026 తర్వాత జూన్ నెలలో భారత జట్టు తన సొంత గడ్డపై ఒక కొత్త సవాలుకు సిద్ధం కానుంది. భారత్, ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడబోతోంది. అయితే ఇది సాధారణ సిరీస్ మాత్రం కాదు. ఆ జట్టుకు గుర్తుండిపోయే మెమరీ ఇది. ఇది రెండు దేశాల మధ్య తొలి వన్డే సిరీస్ కావడంతో అఫ్గాన్ జట్టుకు ప్రాధాన్యత సంతరించుకుంది. టీమిండియా ఇప్పటివరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఐసీసీ టోర్నమెంట్లు, ఆసియా కప్ వంటి పెద్ద వేదికల పై వన్డే మ్యాచ్‌లు ఆడింది. కానీ 2 దేశాల మధ్య ఇప్పటి వరకు ఒక్క ద్వైపాక్షిక వన్డే సిరీస్ కూడా జరగలేదు. అందుకే జూన్ 2026లో జరగనున్న ఈ 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ చరిత్రలో మొదటిసారిగా నమోదు కానుంది.ఈ పర్యటన ఏకైక టెస్ట్ మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. చండీగఢ్‌లో జూన్ 6 నుండి జూన్ 10 మధ్య రెండు జట్లు తొలి జట్టులో



తలపడనున్నాయి. భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఇది రెండవ టెస్ట్ మ్యాచ్ మాత్రమే. అంతకు ముందు రెండు జట్ల మధ్య 2018లో కేవలం ఒకే ఒక టెస్ట్ జరిగింది. 2018లో జరిగిన ఆ టెస్ట్ ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ చరిత్రలో మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ టెస్ట్ మ్యాచ్ తర్వాత జూన్ 14 నుండి భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య చారిత్రాత్మక వన్డే సిరీస్ కూడా జరగనుంది. దీని మొదటి మ్యాచ్ ధర్మశాలలో జరగ నుండగా, రెండవ మ్యాచ్ లక్నో వేదికగా, మూడవ మ్యాచ్ చెన్నైలో నిర్వహించనున్నారు. ప్రపంచంలోని బలమైన జట్లలో ఒకటైన భారత్‌తో వారి స్వదేశంలో ఆడే అవకాశం రావడం ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లకు పెద్ద పరీక్షగా మారవచ్చు.

కానీ వారికి ఇలా ంటి సిరీస్‌లు రావడం ఆఫ్గన్ క్రికెట్‌కు మేలు చేస్తుంది. మరోవైపు ఇండియాకు ఈ సిరీస్ 2027 వన్డే వరల్డ్ కప్ సన్నాహాల దిశగా మొదటి అడుగుగా భావిస్తున్నారు.

# ‘విశ్వనాథ్ అండ్ సన్స్’

## సూర్య-వెంకీ అట్లూరి చిత్రానికి టైటిల్ ఖరారు.. ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్

ఈ ఏడాది జులైలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో ‘ప్రేమలు’ చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు.అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని శ్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ‘లక్కీ భాస్కర్’ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ రీమేక్ కాదు.. అసలు నిజం చెప్పిన హరీశ్ శంకర్

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ ‘తెరి‘కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు ‘తెరి‘ చిత్రంలోనే తన ‘గబ్బర్ సింగ్‘ సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు.

తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. “గబ్బర్ సింగ్ చిత్రానికి నేను ‘మాటలు, మార్పులు, దర్శకత్వం‘ అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే. ఆ టైటిల్ కార్డు చూసి రాజమౌళి గారు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. అలాంటిది, ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ నిజంగా రీమేక్ అయితే ‘కథ, మాటలు, దర్శకత్వం‘ అని ఎందుకు వేసుకుంటాను?“ అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

రీమేక్ ఆరోపణలను తిప్పికొడుతూ ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. “గబ్బర్ సింగ్‌లో నేను పెట్టిన అంత్యాక్షరి ఎపిసోడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ‘తెరి‘లో రౌడీలతో రైమ్స్ చెప్పించారు. నా సినిమాలోని సీన్‌ను వాళ్లు వాడుకుంటే, ఇప్పుడు ఆ సినిమానే నేను రీమేక్ చేస్తున్నానని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం?“ అంటూ హరీశ్ శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఏ పోలీస్ కథలో అయినా హీరో సంఘ విద్రోహ శక్తులపై పోరాడతాడని, ‘తెరి‘, ‘టెంపర్‘ వంటి సినిమాలన్నీ ఆ కోవకే చెందుతాయని అన్నారు.

పవన్ కల్యాణ్ కెరీర్‌లో ‘గబ్బర్ సింగ్‘ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఈ కాంబోలో వస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్‘పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ



మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు అద్భుతమైన స్పందన రాగా, సినిమా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవుతోంది.



# బ్లూ వెలుగుల్లో రకుల్ హీట్!

సాధారణంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక అద్భుతమైన క్షణం జరిగే ఉంటుంది. అయితే ఇప్పుడు తన జీవితంలో ఆ మధురమైన క్షణం ఈరోజు వచ్చింది అంటూ రకుల్ ప్రీత్ సింగ్ తన ఇన్స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్న ఫోటోలు అభిమానులను ఆనందానికి గురి చేస్తున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ఇటీవల ఈమె నటించిన ‘దేదే ప్యార్ దే 2‘ సినిమాకి గాను బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తాజాగా జీ సినీ అవార్డ్స్ 2026 వేడుకల్లో భాగంగా రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న క్షణాలకు సంబంధించిన ఫోటోలను తన ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. చాశ్రీంశీ ఇందులో బ్లూ గ్లిటర్తో డిజైన్ చేసిన ఒక అందమైన డ్రెస్ ధరించి తన అందాలతో వేడుకకే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రంట్ డీప్ వీ నెక్ తో డిజైన్ చేసిన ఈ డ్రెస్ ఈమె అందాలను రెట్టింపు చేసింది. అసలే వైట్ స్కిన్ టోన్ దీనికి తగ్గట్టు బ్లూ డ్రెస్ ఇక ఈమె అందాలను ఏ విధంగా మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తానికైతే బ్లూ డ్రెస్ లో జీ సినీ అవార్డ్స్ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది రకుల్ ప్రీత్ సింగ్. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే రకుల్ ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంటూనే మరొకవైపు ఇలా క్యాప్షన్ జోడించింది. “చాలా సంవత్సరాల తర్వాత మొదటిసారి జీ సినీ అవార్డును అందుకోవడం ..అందులోనూ దేదే ప్యార్ దే 2 చిత్రానికి బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ విభాగంలో అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా కొన్ని ప్రయాణాలు ఎప్పుడు మీతోనే ఉంటాయి. అది ప్రేమ, నవ్వు ఇలా ఎప్పటికీ గుర్తించుకునే జ్ఞాపకాలతో ఆ ప్రయాణం నిండి ఉంటుంది.నాకు మద్దతుగా నిలిచిన అజయ్ దేవగన్, యాక్టర్ మాధవన్, చిత్ర బృందానికి నేను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా నన్ను నమ్మి ఆదరిస్తున్న అభిమానులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను“ అంటూ రకుల్ ప్రీత్ సింగ్ క్యాప్షన్ జోడించింది.



# ‘దండోరా‘ సినిమా ఫెయిల్ కావడానికి కారణం ఇదే: శివాజీ

నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటించిన ‘దండోరా‘ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో సినిమా వైఫల్యానికి గల కారణాలను శివాజీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో విశ్లేషించారు. సినిమా విడుదల సమయం (రిలీజ్ డేట్) సరిగ్గా లేకపోవడమే ప్రధాన తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 25న సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, సెన్సార్ ప్రక్రియలో జాప్యం జరిగిందని.. 24వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు క్లియరెన్స్ రాకపోవడంతో థియేటర్ల యజమానులు రిస్క్ తీసుకోలేకపోయారని ఆయన వెల్లడించారు. సెన్సార్ అవుతుందో లేదో అన్న అనిశ్చితి వల్ల ఎవరూ థియేటర్లు ఇవ్వడానికి ముందుకు రాలేదని, అది సినిమాపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం విడుదల సమయమే కాకుండా, సినిమా టైటిల్ కూడా మైనస్ అయిందని శివాజీ పేర్కొన్నారు. ‘దండోరా‘ అనే పేరు వినగానే ఇది ఒక కమ్యూనిస్టు భావజాలం ఉన్న సినిమా అని ప్రేక్షకులు భావించారని చెప్పారు. అందుకే, ఆ టైటిల్ మార్చాలని తాను నెల రోజుల పాటు ప్రయత్నించానని, కానీ కుదరలేదని చెప్పారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కూడా సినిమాకు సరైన ప్రైమ్ టైమ్ షోలు దక్కలేదని.. కేవలం సాయంత్రం 4 గంటలకు, రాత్రి 10 గంటలకు మాత్రమే షోలు ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ, ఉన్న తక్కువ స్క్రీన్లతోనే నైజాం ఏరియాలో కోటి రూపాయల కలెక్షన్లను రాబట్టడం విశేషమని, ఒకవేళ సరైన థియేటర్లు మరియు షోలు లభించి ఉంటే సినిమా భారీ విజయాన్ని నమోదు చేసేదని శివాజీ స్పష్టం చేశారు. కంటెంట్ పరంగా మెప్పించినా... సాంకేతిక, పంపిణీ పరంగా జరిగిన లోపాల వల్లే ‘దండోరా‘ వెనుకబడిందని ఆయన వివరించారు.

# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్



గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# సొంతూరు తుమ్మెన్‌పేట్‌లో విరోష్ దంపుతులు



వివాహానంతరం టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక స్వగ్రామానికి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నూతన దంపతుల రాకతో గ్రామంలో ఉత్సాహం వెల్లివిరిసింది. పెళ్లి తర్వాతి సంప్రదాయ ఆచారాల్లో భాగంగా ఈ జంట డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా గ్రామంలోకి ప్రవేశించారు. అనంతరం తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆసీనులై, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 400 మందికి పైగా ఆహ్వానితులు హాజరైనట్లు సమాచారం. విజయ్-రష్మికలను ఒక్కసారి చూడాలనే ఆశతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా చేరుకున్నారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయ బద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా నిలిచిన ఈ జంట తమ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫోటోలు అభిమానుల్లో విపరీతంగా షేర్ అవుతూ ట్రెండ్ అవుతున్నాయి.